క్లుప్తంగా

కొత్తపాలెం జంక్షన్‌లో సైన్ బోర్డు ఏర్పాటు



జంక్షన్ వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ప్రతినిధులు

గోపాలపట్నం: కొత్తపాలెం జంక్షన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే మార్గాలను సూచించే సైన్ బోర్డును జేడీ ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు ఏర్పాటు చేశారు. ఈ జంక్షన్‌లో ఏ రోడ్డు ఎటువైపు వెళ్తుందో బోర్డులో సూచించారు. ఫౌండేషన్ సభ్యుడు పులమర శెట్టి అప్పారావు, స్థానిక బిల్డర్ కాళ్ల కృష్ణ సహకారంతో బోర్డు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో స్కంద షష్టి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: స్థానిక ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో చైత్రమాస శుద్ధ షష్టి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్ దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద షష్టి పూజలు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

జేసీ దృష్టికి రైతు బజార్ల సమస్యలు



జేసీ విశ్వనాథన్‌కు మొక్క అందిస్తున్న బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌తో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ మంగళవారం భేటీ అయ్యారు. రైతు బజార్లలో నిత్యం ఎదురవుతున్న సమస్యలను ఆయనకు వివరించారు. విశాఖలో పలు రైతు బజార్ల అభివృద్ధికి సహకరించినందుకు జేసీకి కృతజ్ఞతలు తెలిపారు. రైతు బజార్లలో వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

జీవీఎంసీ కమిషనర్‌కు సత్కారం



కమిషనర్ రాజాబాబును సత్కరిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుకు ఆయన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన్ను గజమాల, పూల కిరీటంతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కృష్ణా జిల్లా కలెక్టర్‌గా వెళ్తున్నందుకు అభినందనలు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌గా వచ్చిన కొద్ది నెలల్లో అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో డీఈ ఏడుకొండలు, గొంతిన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరి నమ్మకం జగన్

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- 59వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు



వైవీ సుబ్బారెడ్డి ముందు జగనన్న సందేశం సెల్ ఫోన్‌లో ఆలకిస్తున్న లబ్ధిదారు



మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ మహిళకు అందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆనంద్‌కుమార్

మల్కాపురం: రాష్ట్రంలో ప్రతి పేద వాడి ఇంట్లో చిరునవ్వులు చిందాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అందులో భాగంగానే వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఓ అన్న మాదిరిగా ఆదుకుంటున్నారని చెప్పారు. జీవీఎంసీ 59వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్‌లో మంగళవారం సాయంత్రం పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న సుబ్బారెడ్డి మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి వెళ్తున్న గృహ సారథులు,కన్వీనర్లకు ప్రజల ఆత్మీయ పలకరింపులతో పాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వారు పొందిన మేలును వివరిస్తున్న తీరు చూస్తే జగన్ జనం గుండెల్లో నిలిచాడని స్పష్టమవుతోందన్నారు. జగన్ అంటే ఓ నమ్మకం, ఓ భరోసా ఏర్పడిందన్నారు. ఈ నమ్మకాన్ని ఎన్ని పచ్చ పత్రికలు ఏకమైనా చెరపలేవన్నారు.

ప్రజల మదిలో టీడీపీ మోసాలు

గత టీడీపీ ప్రభుత్వం అనుసరించిన మోస పూరిత విధానాలు, నాడు వారు ఇచ్చిన ఎన్నికల హామీలు తుంగలో తొక్కిన వైనాన్ని జనం ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. టీడీపీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు తగిన బుద్ధి కచ్చితంగా చెబుతారన్నారు.

అపూర్వ ఆదరణ

పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల నుంచి వార్డు పరిధి పలు ప్రాంతాల్లో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ఒకటే మాట అదే జగన్ బాట అని చెబుతున్నారన్నారు. జగన్ లాంటి ముఖ్యమంత్రి మరలా కావాలని వారు ఆశీర్వదిస్తున్నారని, ప్రజల ఆనందం చూస్తే వచ్చే ఎన్నికల్లో తిరిగి లేని శక్తిగా తమ పార్టీ నిలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే,ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్,వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్‌తో పాటు పలు వార్డుల కార్పొరేటర్లు,అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

సింథియా: నాలుగేళ్ల ప్రభుత్వ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రభంజనంలా కొనసాగుతుంది. జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మెరుగైన పాలన అందించిందో వివరించారు. ఇంటిని యజమాని అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.

- జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, పూర్ణశ్రీయాదవ్

మల్కాపురం: పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు అందించి చరిత్ర సృష్టించారని కొనియాడారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలను జగన్ విస్మరించలేదని, ఆ విషయాన్ని జనం మరిచిపోరాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుర్రె సురేష్‌యాదవ్,రేవళ్ల సత్యనారాయణ,జి.ఎస్.రావు,అమరావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



63వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ, కాకరలోవ ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మెట్ల మార్గాలు, కాలువలు అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, కుమార్, రవి, కేబుల్ రాజు, నరసింహమూర్తి, వర్క్ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంచమ్మ స్థలాన్ని పరిశీలించిన అధికారులు



లక్ష్మీనగర్‌లో కుంచమ్మ స్థలాన్ని పరిశీలిస్తున్న సింహాచలం దేవస్థానం అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో ప్రభుత్వానికి అప్పగించిన కుంచమ్మ స్థలాన్ని సింహాచలం దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి పరిశీలించారు. సర్వేనంబర్ 1లోని 160 గజాల తన ఇంటి స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వాడు కోవాలని లావేటి కుంచమ్మ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. అయితే ఆ స్థలం దేవస్థానం భూముల్లో ఉండడంతో సింహాచలం దేవస్థానం అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. మొత్తం స్థలం ఎంత ఉందో కొలతలు తీశారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్, సర్వేయర్ జగదీష్, వీఆర్వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ హోమం



శ్రీరామ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గాజువాక: పాతకర్ణవానిపాలెంలోని రామాలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శ్రీరామ హోమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు, నవ గ్రహ మండప పూజ, మహారుద్రాభిషేకం చేశా రు. వార్షికోత్సవ పూజల ముగింపు సందర్భంగా బుధవారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, సిరసపల్లి అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కరణం రామకృష్ణ, సాలాపు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

18న సీజ్ చేసిన వాహనాల వేలం



గాజువాక ఆర్టీవో జయప్రకాష్

అగనంపూడి: వాహనాల పన్నులు చెల్లించకపోవడంతో గాజువాక ఆర్టీవో కార్యాలయం సీజ్ చేసిన 15 వాహనాలకు ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గాజువాక ఆర్టీవో జయప్రకాష్ తెలిపారు. వాహనాల పన్ను చెల్లించకుండా రోడ్డు మీద తిరుగుతున్న వాహనాలను ఇటీవల సీజ్ చేయడం చేశామని, సకాలంలో పన్ను చెల్లించి వాటిని తిరిగి తీసుకువెళ్లని కారణంగా ఒక ట్రాక్టర్, రెండు టాటా మ్యాజిక్ వ్యానులు, ఏస్ ట్రక్ ఒకటి, పది మోటార్ సైకిళ్లను వేలం వేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 18వ తేదీలోగా రూ.5వేల డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు అగనంపూడిలోని కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా, వాహనదారులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పెదగంట్యాడ: పౌష్టికాహారంతో చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని వాసవ్య మహిళా మండలికి చెందిన కుశాల్ మెటర్నల్ హెల్త్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రుతు విరతి దశలో ఉన్న మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్, కుశాల్ ప్రతినిధులు రాగి లడ్డూ, కొర్రలతో ఉప్మా చేసి పెట్టారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, మహిళా పోలీస్ శ్రావణి, ఆశ, అరుణ, అరుణాభాయి తదితరులు పాల్గొన్నారు.


జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

గాజువాక: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలు తెరవకముందే సిద్ధంగా ఉంచడం కోసం మండలస్థాయిలో ఒక స్టాక్ పాయింట్‌ను సిద్ధం చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ పాయింట్‌ను ఆర్జేడీ జ్యోతి కుమారి మంగళవారం పరిశీలించారు. జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, గాజువాక మండల విద్యా శాఖాధికారి బి.పైడినాయుడు తదితరులతో పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ తొలుత ఇక్కడి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది 50 పాఠశాలల విద్యార్థులకు సుమారు 8,700 కిట్లను ఇవ్వనున్నట్టు తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లను క్రమ పద్ధతిలో స్కూల్ పాయింట్లకు చేర్చాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఉన్న మొత్తం సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అరుణ్ కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో బి.అప్పలనాయుడు, సీఎంవో సీహెచ్.శిరీష రాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడికి సీసీయూ డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న బోసుబాబు

ఉక్కునగరం: స్టీల్ ఏఐటీయూసీ మాజీ అధ్యక్షుడు, సీపీఐ నాయకుడు జి. బోసుబాబుకు మలావి దేశానికి చెందిన సెంట్రల్ క్రిస్టియన్ యూనివర్సిటీ (సీసీయూ) డాక్టరేట్ అందించింది. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు వర్సిటీ ఏటా డాక్టరేట్లను ప్రదానం చేస్తోంది. అందులో భాగంగా కార్మిక నాయకునిగా బోసుబాబు చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు డాక్టరేట్‌ను ప్రకటించింది. మంగళవారం ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్సలర్ చేతుల మీదుగా బోసుబాబు డాక్టరేట్‌ను అందుకున్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



59వ వార్డులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆనంద్‌కుమార్ తదితరులు



నివాళులర్పిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు



షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

సింథియా: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

- జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ వద్ద బీఏఎంసీఈఎఫ్(బీమ్‌సేఫ్) ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- పూలే జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలో ఆదర్శ రాయల్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ప్రారంభించారు. కార్యక్రమంలో పుక్కల కృష్ణ, అమెరికా శ్రీను, బాబూరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ మెయిన్ గేటు వద్ద...

బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే అని హిందూస్థాన్ షిప్‌యార్డ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. సంస్థ గేటు వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెంపల రామకృష్ణ, ధనుంజయ్, కేజీఎం గణేష్, అప్పలరాజు, బి.సురేష్, కె.కూర్మారావు పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో పూలే చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్ నివాళులర్పించారు.

- ఇదే వార్డు లక్ష్మీనగర్ కాలనీలో బీజేపీ నాయకుడు కొక్కిలగడ్డ విజయబాబు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాసరావు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలి వద్ద జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాంద్రేంగుల సత్యాంజనేయ,గుడాల రాంబాబు తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మల్కాపురం శాఖ గ్రంథాలయంలో పూలే చిత్రపటానికి గ్రంథాలయాధికారి అజేయ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రముఖ న్యాయవాది విశ్వనాథరాజు,రచయితలు సత్యానంద్‌రావు,సత్తిరాజు నివాళులర్పించారు.

పేదల అభ్యున్నతికి పూలే కృషి

గోపాలపట్నం: పేదల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన కృషి మరువలేనిదని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో పూలే జయంతి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంటరానితనాన్ని రూపుమాపడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. సాంఘికసంక్షేమ శాఖ జేడీ డీవీ రమణ మూర్తి మాట్లాడుతూ మహిళల ఉన్నతి కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఏయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ పి. విశ్వనాథం , ఎన్ఎస్‌టీఎల్ ఓబీసీ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మల్కాపురం గ్రామమండలి వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు



భీమ్‌సేఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లక్ష్మణరావు

కంచరపాలెం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతీరావు పూలే అని, ఆయన అడుగుజాడల్లో నేటి యువత నడవాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పేర్కొన్నారు. కంచరపాలెం దళితసేన కార్యాలయంలో రాంజీ అభ్యుదయ సేవా సంఘం, దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు సంయుక్త ఆధ్వర్యంలో పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్.నాగమణి, గొల్లమాల మీన, కామేశ్వరరావు, సీతారామ్, కె.శ్రీనివాస్ రావు, పి.ఝాన్సీ, మల్లికార్జునరావు, రామారావు, ఎస్. గోపి పాల్గొన్నారు.